AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatodaynews.com

17-8-2026 | NIZAMABAD / KAMAREDDY | PAGES - 2


## బాల్కొండ ప్రజావాణికి 5 దరఖాస్తులు



**అక్షరటుడే, బాల్కొండ:** మండల కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. నోడల్ అధికారి, ఎంపీడీవో విజయభాస్కర్ రెడ్డి, తహశీల్దార్ శ్రీనివాస్‌తో పాటు మండల స్థాయి అధికారులు కార్యక్రమానికి హాజరయ్యారు. నుంచి మొత్తం ఐదు దరఖాస్తులు స్వీకరించారు. వీటిలో పంచాయతీరాజ్ శాఖకు రెండు, ఇరిగేషన్ శాఖకు, విద్యాశాఖకు, పోలీస్ శాఖకు ఒక్కొక్కటి చొప్పున దరఖాస్తు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఆయా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను నోడల్ అధికారి ఆదేశించారు.

## భక్తిశ్రద్ధలతో నాగులపంచమి..



నిజామాబాద్‌లో..






కామారెడ్డిలో..

ఉమ్మడి జిల్లాలో నాగుల పంచమిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో పుట్టలలో పాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు. నాగదేవత ఆలయాల్లో మహిళలు భక్తితో పూజలు చేశారు. – అక్షరటుడే, నెట్‌వర్క్






బాల్కొండలో..


ఆర్మూర్‌లో..


బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో ఆవుపాల పంపిణీ


ఎల్లారెడ్డిలో..


మెండోరాలో..

**ఆహార ఉత్పత్తులు, ఔషధాల కల్తీకి చెక్ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకమైన కార్యాచరణకు శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం ఉన్న ఔషధ నియంత్రణ యంత్రాంగం (డీసీఏ), ఆహార భద్రత విభాగాలను విలీనం చేసింది. క్షేత్రస్థాయిలో కల్తీ రాయుళ్లపై నిఘా పెట్టేందుకు టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయనుంది. ఈ నూతన వ్యవస్థ ద్వారా ఉమ్మడి నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో ప్రజారోగ్యంతో చెలగాటమాడే అక్రమార్కులపై ఉక్కుపాదం మోపేందుకు మార్గం సుగమమైంది.**

- అక్షరటుడే, భీమ్‌గల్

# ‘కల్తీ’పై ఉక్కుపాదం!



- నూతన విభాగం ఏర్పాటు చేసిన ప్రభుత్వం
- హోటళ్లు, వ్యాపార సముదాయాలపై తనిఖీలు

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ‘తెలంగాణ సేఫ్’ అనే విభాగాన్ని ఏర్పాటు చేసింది. దీని కమిషనర్‌గా ఐపీఎస్ అవినాశ్ మొహంతిని నియమించింది. అంతేగాకుండా పోలీసు శాఖ నుంచి పలువురిని దీనికి పంపాలని ఆదేశించింది. మూడు ప్రధాన విభాగాల నుంచి దాదాపు 1,500 మంది సిబ్బందిని కేటాయించేందుకు నివేదికలు సిద్ధమయ్యాయి. నమోదయ్యే కేసుల సమర్థవంతమైన విచారణ, చట్టపరమైన చర్యల పర్యవేక్షణ కోసం ఒక ప్రత్యేక పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. కల్తీ నిరోధక విభాగాన్ని మొత్తం 4 ప్రత్యేక జోన్లుగా విభజించి నిరంతర తనిఖీలు చేపట్టనున్నారు.

### ఉమ్మడి జిల్లాల్లో..

ఇటీవల ఉమ్మడి నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల పరిధిలో ఆహార భద్రతా టాస్క్‌ఫోర్స్ అధికారులు జోనల్ అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ వి.జ్యోతిర్మయి నేతృత్వంలో నిర్వహించిన ఆకస్మిక దాడుల్లో షాకింగ్ నిజాలు వెలుగుచూశాయి. నిజామాబాద్ నగరంలోని లహరి హోటల్ పై జరిపిన తనిఖీల్లో ప్లాస్టిక్ కవర్లలో నిల్వ ఉంచిన దాదాపు 122 కిలోల కుళ్లిన మాంసాన్ని, రూ.30వేల విలువైన నిషిద్ధ సింథటిక్ రంగులు, బూజు పట్టిన కూరగాయలను అధికారులు స్వాధీనం చేసుకుని ధ్వంసం చేశారు. నగరంలోని వంశీ ఇంటర్నేషనల్ హోటల్‌లో గడువు తీరిన కారం, మసాలా పొడులు వాడటంతో పాటు సరైన గాలి, వెలుతురు లేని అపరిశుభ్ర వంటగదిని గుర్తించిన అధికారులు సదరు యాజమాన్యానికి నోటీసులు జారీ చేశారు. మిర్చి కాంపౌండ్ సమీపంలోని ఢిల్లీవాలా స్వీట్ హోమ్‌తో పాటు పలు మసాలా దినుసుల తయారీ కేంద్రాల్లో పరిశుభ్రతా ప్రమాణాలు లేకపోవడాన్ని గుర్తించి హెచ్చరికలు జారీ చేశారు.

### సిలిండర్లు సీజ్

ఆర్మూర్, బోధన్ ప్రాంతాల్లోని పలు హోటళ్లు, టిఫిన్ సెంటర్లలో అధికారులు దాడులు చేశారు. వాణిజ్య అవసరాలకు డొమెస్టిక్ సిలిండర్లు వాడుతుండటంతో చర్యలు చేపట్టారు. దాదాపు 65 సిలిండర్లను సీజ్ చేశారు. మహారాష్ట్ర, కర్ణాటక సరిహద్దులు కలిగిన నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు పక్క రాష్ట్రాల నుంచి కల్తీ పాలు, నాణ్యత లేని వంటనూనెలు, నకిలీ మసాలా దినుసులతో పాటు నిషిద్ధ ఔషధాల రవాణా జరుగుతోందనే ఫిర్యాదులున్నాయి. టాస్క్‌ఫోర్స్ ఏర్పాటుతో వీటికి చెక్ పడనుంది.



## ఎల్లారెడ్డి అభివృద్ధికి కృషి చేయాలి: మదన్ మోహన్

**అక్షరటుడే, ఎల్లారెడ్డి :** ఎల్లారెడ్డిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు విడుదల చేయాలని ఎమ్మెల్యే మదన్ మోహన్ కోరారు. ఈ మేరకు సోమవారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు వినతిపత్రం అందజేశారు. పెండింగ్ బిల్లుల విడుదల, 13 నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ల మంజూరు కోసం డిప్యూటీ సీఎంకు విన్నవించారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో నెలకొన్న లో వోల్టేజ్ సమస్యలు, విద్యుత్ అవసరాల కారణంగా 13 నూతన సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలను ఎమ్మెల్యే డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లారు. అదే సమయంలో వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను త్వరితగతిన విడుదల చేయాలని కోరారు. గోలి లింగాల గేట్ (నాగిరెడ్డిపేట్), గిద్ద (రామారెడ్డి మండలం), వెల్లుట్ల (ఎల్లారెడ్డి మండలం), సోమార్‌పేట్ (ఎల్లారెడ్డి), దుర్గం, గౌరారం కలాన్, గుర్జాల్ (గాంధారి), ధర్మారావుపేట్, కుప్రియాల్, తిమ్మోజీవాడి, లింగంపల్లి (సదాశివనగర్), మెంగారం, లింగంపల్లి ఖుర్ద్ (లింగంపేట్) ఉన్నాయి. అయితే ఎమ్మెల్యే మదన్ మోహన్ అందించిన వినతి పత్రంపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించారు.

## పీసీసీ చీఫ్ ఇంటి ముట్టడికి పీడీఎస్‌యూ యత్నం.. పలువురి అరెస్ట్



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని పీసీసీ చీఫ్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఇంటిని ముట్టడించేందుకు యత్నించారు. నగరంలోని నాల్గో టౌన్ పరిధిలోని బస్వా గార్డెన్ సమీపంలో ఉన్న పీసీసీ చీఫ్ ఇంటికి పీడీఎస్‌యూ నాయకులు చేరుకున్నారు. ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న నాల్గో టౌన్ పోలీసులు వెంటనే స్పందించారు. పీడీఎస్‌యూ నాయకులను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

## ఎంపీ అర్వింద్ గురించి మాట్లాడితే ఊరుకోం..

**అక్షరటుడే, ఇందూరు:** ఎలాంటి అర్హత లేని కాంగ్రెస్ నాయకులు ఎంపీ అర్వింద్ గురించి మాట్లాడితే ఊరుకునేది లేదని బీజేపీ కార్పొరేటర్లు పేర్కొన్నారు. నగరంలోని ఆ పార్టీ కార్యాలయంలో సోమవారం మాట్లాడారు. నగరంఒని 35వ డివిజన్ కార్పొరేటర్ ఎర్రం సుధీర్, 22వ డివిజన్ కార్పొరేటర్ సాయి వైష్ణవి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ విసిరే బిస్కెట్లకు ఆశపడి కొంతమంది నాయకులు ఈమధ్య ఎంపీ అర్వింద్‌పై అవాకులు చవాకులు మాట్లాడుతున్నారన్నారు. పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తన జీవితంలో ఎప్పుడూ ప్రజా ఉద్యమాల్లో పాల్గొనలేదని.. ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేసి గెలిచిన చరిత్ర కూడా ఆయనకు లేదన్నారు. అలాగే బాల్కొండకు చెందిన ఈరవత్రి అనిల్ గతంలో చిరంజీవి పుణ్యమా అని ఒకసారి గెలిచారని.. ఆ తర్వాత ఏనాడూ ఎన్నికల్లో గెలవలేదన్నారు. ఇలాంటి వ్యక్తులు తన రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికే ఎంపీ అర్వింద్‌పై చిల్లర మాటలు మాట్లాడుతున్నారన్నారు. రాష్ట్రంలోనే నిజామాబాద్ జిల్లాలో బీజేపీ అత్యంత బలంగా ఉందని కార్పొరేటర్లు పేర్కొన్నారు. జిల్లాలో ఇద్దరు ఎమ్మెల్యేలు, 28 మంది కార్పొరేటర్లు, 100కి పైగా సర్పంచులు, లక్షలాది మంది కార్యకర్తలు ఉన్నారంటే అది బలమైన బీసీ నాయకుడు అర్వింద్ నాయకత్వ బలమేనన్నారు. అలాంటి ప్రజా నాయకుడిపై చిల్లర మాటలు మాట్లాడితే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. మాట్లాడేటప్పుడు ఒళ్ళు దగ్గర పెట్టుకుని మాట్లాడాలని హితవు పలికారు. మహేశ్ కుమార్ గౌడ్ నగరంలో కార్పొరేటర్‌గా గెలిచి చూపించాలన్నారు.




## కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కొనసాగించాలి: మాజీ మంత్రి వేముల

**భీమ్‌గల్(వేల్పూర్), అక్షరటుడే:** కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ఎప్పటిలాగే కొనసాగించాలని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి డిమాండ్ చేశారు. వేల్పూర్ మండల తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ధర్నా కార్యక్రమంలో బాల్కొండ నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొని ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వేముల ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ.. పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఆర్థిక భరోసా కల్పించాలనే ఉన్నతమైన లక్ష్యంతో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ పథకాలను తీసుకొచ్చారని గుర్తుచేశారు. అయితే, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కల్యాణలక్ష్మి చెక్కుతో పాటు తులం బంగారం ఇస్తామని ఆశచూపి ఓట్లు వేయించుకుందని, తీరా అధికారంలోకి వచ్చాక ఆ హామీని నీరుగార్చిందని మండిపడ్డారు. అంతేకాకుండా కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కూడా రద్దు చేసేందుకు ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆయన ఆరోపించారు. పేదల సంక్షేమానికి సంబంధించిన ఈ పథకాలను ఎలాంటి కోతలు లేకుండా కొనసాగించాలని, ఇచ్చిన హామీ ప్రకారం తులం బంగారం అందించాలని డిమాండ్ చేశారు. పేదల హక్కుల సాధన కోసం, సంక్షేమ పథకాల పరిరక్షణ కోసం బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.



## ఒక్కొక్కటిగా బయటికొస్తున్న సీఎంఆర్ బాగోతాలు

### మరో రైస్‌మిల్‌లో ధాన్యం గల్లంతు

**అక్షరటుడే, డిచ్‌పల్లి:** జిల్లాలో సీఎంఆర్ బాగోతాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. నెలరోజుల్లోనే జిల్లాలోని బోధన్, ఖానాపూర్‌లోని రైస్‌మిల్లులపై దాడులు చేసిన విజిలెన్స్ అధికారులు కేసులు నమోదు చేశారు. గతంలో అధికారులు కేసులు నమోదు చేసిన రైస్‌మిల్లులు భారీ ఎత్తున ప్రభుత్వానికి సీఎంఆర్ ఎగ్గొట్టినట్లు రికార్డులు తేల్చాయి. తాజాగా డిచ్‌పల్లి లోని ఓ రైస్‌మిల్ సైతం భారీ ఎత్తున సీఎంఆర్ మాయం చేసినట్లు తెలుస్తోంది. మండలంలోని సుద్దులం గ్రామ పరిధిలోని ఓం సాయి బాలాజీ రైస్‌మిల్లులో సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) కోసం కేటాయించిన ధాన్యంలో 8,618 క్వింటాళ్లు గల్లంతైనట్లు దర్యాప్తులో తేలిందని ఎస్సై ఆరిఫ్ తెలిపారు. గల్లంతైన ధాన్యం విలువ సుమారు రూ.27,11,17,286 ఉంటుందని పేర్కొన్నారు. 2022 నుంచి గతేడాది వరకు సీఎంఆర్ కోసం కేటాయించిన ధాన్యాన్ని మిల్లింగ్ చేసి ప్రభుత్వానికి తిరిగి అప్పగించాల్సి ఉండగా, అప్పగించకపోవడంతో పౌరసరఫరాల శాఖ అధికారులు మిల్లులో మూడు రోజులపాటు తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో ధాన్యం నిల్వల్లో భారీ వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించినట్లు ఎస్సై తెలిపారు. పౌరసరఫరాల శాఖ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రైస్‌మిల్లు యజమానులు కూన వెంకటేష్, వరలక్ష్మి, ప్రియాంకలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆరిఫ్ వెల్లడించారు. ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు.



## బస్సు సౌకర్యం కల్పించాలని ప్రజావాణిలో ఫిర్యాదు



**అక్షరటుడే, పెద్దకొడప్‌గల్:** మండల కేంద్రంలో ఎంపీడీవో అభినవ్ చందర్ ఆధ్వర్యంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు సుభాష్‌తో పాటు స్థానిక నాయకులు కలిసి గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలని ప్రజావాణిలో అధికారులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని పెద్ద దేవిసింగ్ తండా, వడ్లం, కస్లాబాద్, బేగంపూర్, పిట్లం రూట్లలో బస్సు సౌకర్యం కల్పించి విద్యార్థులకు న్యాయం చేయాలని పేర్కొన్నారు. బస్సు సౌకర్యం లేక విద్యార్థులు చదువును మధ్యలోనే మానేస్తున్నారని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్యపై అధికారులు వెంటనే స్పందించి బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు.

## కాటేపల్లి తండాలో నూతన రేషన్ షాప్ ఏర్పాటు చేయాలి



**అక్షరటుడే, పెద్ద కొడప్‌గల్:** మండలంలోని కాటేపల్లి తండాలో నూతనంగా రేషన్ షాప్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మల్లప్ప పటేల్ ఆధ్వర్యంలో తండా వాసులు సోమవారం 'ప్రజావాణి'లో ఎంపీడీఓ అభినవ్ చందర్‌కు వినతిపత్రం సమర్పించారు. ప్రస్తుతం రేషన్ షాప్ కాటేపల్లి గ్రామంలో ఉండటంతో, బియ్యం, ఇతర రేషన్ సరుకులు తెచ్చుకోవడానికి తండా నుండి కాటేపల్లి గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లాల్సి వస్తోందని, దీనివల్ల తండా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కావున, తమ తండాలోనే నూతన రేషన్ షాప్‌ను ఏర్పాటు చేసి తండా వాసులను ఆదుకోవాలని సదరు వినతిపత్రంలో పేర్కొన్నారు.

## డీసీసీ కార్యాలయం ఎదుట బీజేవైఎం 'వందేమాతరం' గీతాలాపన..



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఎదుట బీజేవైఎం నాయకులు వందేమాతరం గీతాలాపన చేశారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కాంగ్రెస్ అగ్ర నాయకులు మల్లికార్జున ఖర్గే, సోనియాగాంధీ వందేమాతర గీతాలాపన చేయలేదని బీజేవైఎం నాయకులు ఆరోపించారు. వారికి వందేమాతర గీతం ఎలా పాడాలనేది నేర్పించేందుకు తాము కాంగ్రెస్ కార్యాలయానికి వచ్చామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కార్యాలయం ఎదుట వందేమాతరం గీతాలాపన చేశామన్నారు. పోలీసులు బీజేపీ నాయకులను అడ్డుకున్నారు. వారిని అక్కడి నుంచి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అంతకుముందు కార్యాలయం ఎదుట బీజేపీ నాయకులు, పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు వంశీ గౌడ్, కార్పొరేటర్లు కల్పె అర్చన చిరంజీవి, సుధీర్, శశాంక్, శ్రావణ్ పలువురు బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.

# 'ప్రజావాణి'తో తగ్గిన దూరభారం

గ్రామీణ ప్రాంత ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు.. పాలనను మరింత చేరువ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీంట్లో భాగంగా స్థానికంగా సమస్యలు పరిష్కారం కోసం ఎంపీడీవో కార్యాలయంలోనే ప్రజావాణి కార్యక్రమాన్ని ఈ సోమవారం నుంచి ప్రారంభించింది.

– అక్షరటుడే, ఎల్లారెడ్డి



**■ ఎంపీడీవో కార్యాలయాల్లోనే అమలు ■ హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు ■ సమస్యలు పరిష్కరించాలని వేడుకోలు**

ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రజావాణి నిర్వహించడంపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తమకు స్థానికంగానే ప్రజావాణి ఏర్పాటు చేయడంతో దూరభారం తగ్గిందని.. సమయం కుదురుతుందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రజావాణిలో సమస్యల పరిష్కారం తరగతుల పోటీ చేస్తే ఈ కార్యక్రమ నిర్వహణకు అర్థం ఉంటుందని పేర్కొంటున్నారు. ఇందులో భాగంగా సోమవారం నుండి ప్రారంభమైన ప్రజావాణికి మండల పరిషత్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులు సకాలంలో హాజరయ్యారు. ఉదయం 10 నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నారు.

### తగ్గిన దూరభారం

గతంలో తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు మండల స్థాయి అధికారులు పట్టించుకోకపోవడంతో గ్రామీణ ప్రజలు తమ సమస్యలను విన్నవించేందుకు జిల్లా కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేది. మద్నూర్, జుక్కల్, పెట్లకోడిగల్, బిచ్కుంద, బీర్కూర్ పిట్లం ఎల్లారెడ్డి బాన్సువాడ తదితర మండలాలకు కామారెడ్డి సుమారు 50 నుంచి 100 కి.మీ దూరంలో అయ్యేది. ఉదయం 5 గంటలకు గ్రామం నుంచి బయల్దేరి సాయంత్రం 6 గంటలకు తిరిగి ఇంటికి చేరుకునేవారు. వినతి ఇవ్వాలంటే ఒక రోజు మొత్తం సమయాన్ని కేటాయించాల్సి వచ్చేది. ప్రస్తుతం మండల స్థాయిలో ప్రజావాణి నిర్వహణతో ఇక నుంచి ఆ తిప్పలు తప్పనున్నాయి. ప్రభుత్వం నూతన విధానంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### ప్రజావాణి నిర్వహణపై పూర్తిస్థాయి అవగాహన..

మండల స్థాయి ప్రజావాణి నిర్వహణపై ఎంపీడీవోలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఫిర్యాదుదారులు లేదా ప్రతి ఫిర్యాదుకు సంబంధించిన రసీదు ఇవ్వాలి. కార్యాలయ ఆవరణలో ప్రతి వినతిని వెంటనే ప్రభుత్వ పోర్టల్‌లో నమోదు చేసి సంబంధిత శాఖకు పంపించాలి. తహశీల్దార్, ఎంపీడీవో, ఎంపీవో, ఏవో, ఉద్యానవన శాఖ, విద్య, వైద్య శాఖ, పశువైద్యాధికారి, హౌసింగ్, పీఆర్, విద్యుత్, సాంఘిక సంక్షేమ శాఖ, ఇరిగేషన్ ఆయా శాఖల అధికారులు ప్రజావాణిలో పాల్గొని అందిన ప్రతి వినతిని ఆధీనంలోకి తీసుకుంటారు. అన్ని శాఖల అధికారులు ఒకే వేదికపైకి రావడంతో వినతులపై తక్షణమే సమీక్షించి పరిష్కరించే అవకాశం ఉండనుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

### ప్రధానంగా పరిష్కరించే అంశాలివే..

పెండింగ్ దరఖాస్తులు, సంక్షేమ పథకాల అమలు, రెవెన్యూ, పంచాయతీరాజ్ సంబంధిత సమస్యలను పరిష్కరించనున్నారు. అలాగే రేషన్ కార్డు, ఆధార్, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన ఫిర్యాదులు స్వీకరిస్తారు. ఉపాధి హామీ, వ్యవసాయం, విద్య, వైద్య సమస్యలు పరిష్కరిస్తారు. ఈ విధానం ద్వారా ప్రజలకు సమయం, డబ్బు ఆదా అవడంతో పాటు సమస్యలు పరిష్కారమయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.



## విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ

**అక్షరటుడే, ముప్కాల్:** మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో ప్రభుత్వం అందజేసిన ప్లేట్లు, గ్లాసులను సోమవారం విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు 70 ప్లేట్లు, గ్లాసులు, బౌల్లు, స్పూన్లు, కప్పులను అందజేశారు. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పాఠశాల సిబ్బంది సూచించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

## రోడ్డు సౌకర్యం కల్పించాలని కలెక్టర్‌కు ఫిర్యాదు

**అక్షరటుడే, గాంధారి:** మండలంలోని అంగడి బజార్ వద్ద తరతరాలుగా వస్తున్న దారి కబ్జాకు గురైందని, దీనివల్ల తమ ఇళ్లకు వెళ్లేందుకు మార్గం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని బాధితులు ప్రజావాణిలో కలెక్టర్‌కు విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఊరి ప్రయోజనం కోసం కేటాయించిన భూమిలో ఇప్పుడు ఇతరులు ఆక్రమణకు పాల్పడుతున్నారని ఆరోపించారు. స్థానిక మండల స్థాయి అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతోనే చివరికి కలెక్టర్‌ను ఆశ్రయించామని తెలిపారు. వెంటనే స్పందించి ఆక్రమణలను తొలగించి, ఇళ్లకు వెళ్లేందుకు కనీసం రోడ్డు సదుపాయం కల్పించాలని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ హౌస్ అరెస్ట్..



**అక్షరటుడే, ఎల్లారెడ్డి :** ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్‌ను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. కామారెడ్డి లోని ఆయన స్వగృహంలో పోలీసులు గృహనిర్బంధం చేశారు. జాజాల మాట్లాడుతూ..పేద బిడ్డలకు ఆసరాగా ఉన్న కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేసిందన్నారు. దీనిని నిరసిస్తూ లింగంపేట పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో సోమవారం భారీ ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించ తలపెట్టామన్నారు. అయితే శాంతియుతంగా ధర్నా చేసేందుకు నిర్ణయిస్తే పోలీసులు ముందస్తుగా గృహ నిర్బంధం చేయడం ఎంత వరకు సమంజసమని మాజీ ఎమ్మెల్యే ప్రశ్నించారు. పథకాల అమలును నిలిపివేశారని నిరసిస్తూ ధర్నా చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నేరంగా పరిగణిస్తున్నారని జాజాల ఆగ్రహం వ్యక్తం చేశారు. లబ్ధిదారుల తరపున నిరసన వ్యక్తం చేసే స్వేచ్ఛ కూడా కాంగ్రెస్ హయాంలో లేకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు తాము ఈ నిరసన కార్యక్రమం తలపెట్టామన్నారు. పేద ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఆర్థిక చేయూతనిచ్చే కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేయడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.



## అక్రమ నిర్మాణాలను అరికట్టాలి

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నగరంలోని 8వ డివిజన్‌లో అక్రమ నిర్మాణాలను, కబ్జాలను అరికట్టాలని డివిజన్ కార్పొరేటర్ మఠం పవన్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని ప్రజావాణిలో మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. పవన్ మాట్లాడుతూ.. డివిజన్‌లోని పలు కాలనీల్లో అక్రమ నిర్మాణాలు, రోడ్ల కబ్జా, మున్సిపల్ నిబంధనల ఉల్లంఘన దర్జాగా సాగుతోందని ఆరోపించారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఇలా జరుగుతోందని ఆరోపించారు. కొంతమంది బిల్డర్లు, భూకబ్జాదారులు ప్రభుత్వ భూములు, రోడ్లను కబ్జా చేసి అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. ప్రత్యేకించి రోడ్లపై ర్యాంప్‌లు వేయడం వల్ల ప్రజలు రోడ్లపై నడవడానికి కూడా వీలులేకుండా పోయిందని పేర్కొన్నారు. కబ్జాల కారణంగా వర్షాకాలంలో వర్షం, మురికి నీరు వెళ్లడానికి ఎలాంటి దారి లేకుండా పోయిందని కార్పొరేటర్ ఆరోపించారు. ఫలితంగా డివిజన్‌లోని ప్రజలందరూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.





## పథకాలను పునరుద్ధరించాలి..

**కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను పునరుద్ధరించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఉమ్మడిజిల్లాలో రహదారులపై రాస్తారోకోలు నిర్వహించారు. బాల్కొండలో మాజీమంత్రి ప్రశాంత్‌రెడ్డి ధర్నా చేయగా.. కామారెడ్డిలో జాజాల రోడ్డుపై ధర్నాకు దిగారు. పలు మండలాల్లో అధికారులకు నాయకులు వినతిపత్రాలు అందజేశారు.**

**– అక్షరటుడే, నెట్‌వర్క్**





## పాలిటెక్నిక్ కళాశాలలను 'శక్తి'శాఖలో విలీన ప్రతిపాదనను విరమించుకోవాలి



**అక్షరటుడే, నందిపేట్:** పాలిటెక్నిక్ కళాశాలలను 'శక్తి' శాఖలో విలీనం చేసే ప్రతిపాదనను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలో పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు భారీ ఎత్తున రాస్తారోకో కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ ఆందోళన కార్యక్రమానికి నందిపేట్ మండల బీఆర్ఎస్ పూర్తి మద్దతు తెలిపింది. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ముచ్చర్ల సాగర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో పాలిటెక్నిక్ కళాశాలలను శక్తి శాఖలో విలీనం చేసే ఆలోచనను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. పాలిటెక్నిక్ విద్యార్థులు మూడేళ్ల పాటు కష్టపడి అభ్యసించే సాంకేతిక విద్యకు నష్టం కలిగించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. 'శక్తి' పథకం పేరుతో పాలిటెక్నిక్ విద్యార్థులను ఐటీఐ విద్యార్థులతో సమానంగా పరిగణించడం సరికాదని అన్నారు. ఈ విలీనం వల్ల అధ్యాపకులు, ఉద్యోగుల పదోన్నతులు, బదిలీలు, ఉద్యోగ భద్రత తీవ్రంగా దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేశారు. గుర్తింపు పొందిన పాలిటెక్నిక్ విద్య ద్వారా ఎంతోమంది బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు తక్కువ ఖర్చుతో ఇంజినీరింగ్ విద్యను అభ్యసిస్తున్నారని గుర్తుచేశారు. విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేసే ఇటువంటి నిర్ణయాలను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నందిపేట్ మండల బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.